# వినాయక చవితి

తనరఁ దూరుపు ద్వారబంధంబు చుట్టు
మబ్బు గుమ్మాలఁ బసపు సమ్మాన మొసఁగి
చిగురు కిరణాల తోరణాల్ చిన్నె లొప్ప
వెలుఁగఁ జేసెను భానుఁడన్ పిల్లవాఁడు.

అప్పుడే బాల బాలిక లాత్రపడుచు
స్నానములు చేసి పూవులు చాల వనుచు
పత్రి చాలదు నింకఁ దేవలె నటంచు
నరయ వ్యవహార వృద్ధుల ట్లాడుకొనిరి.

"అమ్మ తలంటి పోయనె లేదె నీ" కని
పెఱయింటి పిల్లను బిలచి పోసి
"మంచి చొక్కా లేదె? మావాని దిదిగో" య
టని తొడ్గి ప్రక్కింటి యర్భకునకు

"ఈపూట మాయింటనే పూజ చూచిపో
తల్లి" యఁటని పేద పిల్ల నాపి
"అమ్మా! మనింట నీ యబ్బాయి నీపూట
నుండు మందమె" యని యుంచివైచి

పల్లె పల్లె కలసి పల్లె యొక్కిల్లు గాఁ
బళ్లెలోన గలియు పిల్ల లెల్ల
నొక్క తల్లి బిడ్డలో యన నేకమై
తీరి కేమి లేక తిరుగు చుండ్రి.

పాదు పందిరి బద్ద పాలవెల్లికి లాగి
చీల్చి ముక్కలు చేసికొల్చి చూచి
పురికొసల్ డేనికి మూతి కట్టిన వేని
యోపికతోఁ ద్రెంప కూడఁదీసి

దొడ్డిలో వెలగను దులిపి పిందెలతోడ
పాలవెల్లికి నాల్గు మూలఁ గట్టి
ప్రాత దేవళ్ళున్న పటము లవ్వలఁ బెట్టి
పసుపు పిటుకు ముగ్గు బద్దెపెట్టి

వాకిట వినాయకుని అమ్మ వాని కొఱకు
నెదురు చూచిన తనకు వా( డెదురు వచ్చి
కలువ మొగ్గలు తమ్మి మొగ్గలను విలిచి
కనుల నిండుగ బిడ్డలు కట్టుకొనిరి.

తను జూచు వార లీత(డు పెద్దవా( డను
కొను నట్లు పూజలో( గూరుచుండి
యాడువారిని బిల్చి "యది తెమ్మ! యిది తెమ్మ!"
అని యధికారాన నడిగె బిడ్డ
తమ్మని పూజకై తగు వస్తువు లమర్చి
పిండి యుండ్రాల్ చేసిపెట్టి మఱియు
నేతి దివ్వియ పెట్టి నిలుచుండి యొకపిల్ల
తా నింటి పెద్దగా( దల(చు కొనియె

తాము బిడ్డల క్రొత్త పెత్తనము చూచి
తల్లి తండ్రియు వారికి( దగిన విలువ
గలుగు వస్తువులను భక్ష్యములును గూర్చి
వేడుక( జరింత్రు తామును బిడ్డ లట్లు.

మట్టి విఘ్నేశుఁడు ముట్టిన విడిపోవు
రంగుఁ విఘ్నేశుఁ గొనంగ వలయు

పాలవెల్లియె యెట్లు చాలు నీ దేవున
కు? గొడు గొక్కటి గూడఁ గొనవలయు

సాంబ్రాణియే యెట్లు చాలును? మరి యగ
ర్వత్తు లుండినఁ గాని వల్ల గాదు

పూజకు నిరు డున్న పుస్తకం బెటు చాలు
క్రొత్త పుస్తకమును గొనకతప్ప

దింటిలో నున్న యఱటి పండ్లేమి చాలు
మంచి టెంకాయ కొఱకుఁ బంపించ వలయు
ననుచుఁ దమయింటి పెద్దల నదుపు పెట్టఁ
బిల్లలకు హక్కొసంగెను విఘ్న పతియు.

వంటైనదా యన భర్తఁ భార్యయుఁ బిండి
వంట యాలస్యమే పైన యనఁగ

రావచ్చునా యన, రావచ్చు మనవాని
పూజయే యాలస్యము గద యనఁగ

ఆలస్య మున్నదా యన్న విఘ్నేశ్వరుం
డారగించుచు నుండె నాగుఁ డనఁగ

వద్ద నైనద యన్న వడ్డించుచుంటిని
యంత తొందర యేమి యాగుఁ డనగ

జాగు సేయుట నాకలి సాఁగి సాఁగి
పంచ భక్ష్యంబు లుండ్రాలు పాయసంపు
క్రొత్త రుచితోడి యాకలి కూడికొనుచు
రుచుల హెచ్చింప భుజియించి రుచిత భక్తి.

కాకు లెత్తుక పోవఁగాఁ బచ్చి యుండ్రాలు
బంధువు లిండ్లపైఁ బాఱజల్లి
సంజ చీకటి వేళ సౌధాంగణంబులఁ
బల్లేరు కాయలు పరచి పోయి
దీపాల క్రీనీడఁ బ్రాపైన గచ్చు గు
మ్మాలపైఁ జోళ్ళ లమర్చి యుంచి
అడుగిడఁ గాళ్లారు నట్లరుగుల పైన
నరటిపండుల పెచ్చు లణచి పెట్టి

పెద్ద వారి నిట్లు విసిగించి వారిచే
దీవ నాత్మకములఁ దిట్లను దిని
బాల శశినిఁ జూచు నీలాపనిందను
విడువఁ జూచుకొనిరి బిడ్డ లెల్ల.

క్రొత్త కోడలు మ్రొక్కు కొన్నది లోలోన
　　　　చిన్ని బిడ్డను గోరి సిగ్గుతోడ
పలక ప్రక్కను పెట్టి పదియేండ్ల బాలుఁడు
　　　　చదువు రావలె నంచు సాఁగి మ్రొక్కె
అన్నయ్యకును పెండ్లి యయ్యె నాకో యంచు
　　　　దిసమొల మ్రొక్కె నైదేండ్ల వాఁడు
నీ పరార్థం బేమి నే నెఱుంగఁ దలంతు
　　　　నని మ్రొక్కె సంసారి యైన సుతుఁడు.

ఎల్ల వేళలందు నిల్లెల్లఁ బండువై
తరుగ కుండు కొఱకుఁ దండ్రి మ్రొక్కె
తల్లి కోరి మ్రొక్కెఁ దనవారి క్షేమంబు
విఘ్నపతికిఁ జవితి వేళ భక్తి.

అందఱను జేరఁ బిల్చి సాయాహ్న వేళ
వృద్ధ మాతామహుఁడు కథ విన్చి పిన్న
పెద్దలను జేర్చి యక్షితల్ పెట్టి దీవ
నాత్ముఁడై పొల్చె దీర్ఘాయు రస్తు టంచు.

పరిపత త్కిల్బిష భ్రమర బిభీషి కో
జ్జ్వల శూర్పఁ కర్ణ సంచాలనంబు
మదకుంభి రాక్ష సోన్మథన క్రియా దక్ష
దంతురి తైకాగ్ర దంత శిక్ష
సప్త లోకస్థ రాక్షస హృ దుద్భేదక
క్రీడన చాపల్య ఘీంకృతంబు
హాస్య వీ రా ద్భుత వ్యాపార కారణ
స్థితిమ త్సువిగ్రహ దేహ పుష్టి

ప్రమథ శతకోటి గణ పరిపాలనంబు
భక్త లోక సంరక్షణ పాటవంబు
నైన నీభావ మెపు నా యాత్మలోన
వెలయు నట్లుగ వరమిమ్ము విఘ్నరాజ!